కోమాలోకి వెళ్లిన రోగికి పునర్జన్మ



కోలుకున్న నాగరాజుతో ఓమెగా వైద్య బృందం. హాస్పిటల్‌లో చేరినప్పుడు నాగరాజు (ఇన్‌సెట్‌లో)

- ఓమెగా దవాఖానలో చికిత్స

విద్యానగర్, డిసెంబర్ 21 : తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ మెదడుపై ప్రభావం చూపడంతో కోమాలోకి వెళ్లిన ఓ రోగికి కరీంనగర్‌లోని ఓమెగా ప్రైవేట్ దవాఖాన వైద్యులు 22 రోజులపాటు చికిత్స అందించి మామూలు మనిషిని చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన రోగికి నామమాత్రపు ఫీజుతో చికిత్స అందించి పునర్జన్మనిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్లకు చెందిన మొగ్గం నాగరాజు (28) అనే యువకుడు ఉపాధి కోసం 8 ఏండ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ పనిచేసుకుంటూ ఇంటి వద్ద ఉన్న తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. అయితే నెల రోజుల కింద ఆంధ్రప్రదేశ్‌లోని పాలకొల్లు తన స్నేహితుడితో కలిసి అక్కడికి వెళ్లాడు. అక్కడే తీవ్ర మైన జ్వరంతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. నాలుగు రోజులపాటు అక్కడి దవాఖానలో చికిత్స చేయించినా నాగరాజు జ్వరం తగ్గకపోగా మరింత విషమంగా మారింది. దీంతో నాగరాజు స్నేహితుడు అతడి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. అక్కడికి వెళ్లి చూడగా తీవ్ర అనారోగ్య సమస్యలతో ఉన్నట్లు గుర్తించిన నాగరాజు తల్లిదండ్రులు, సోదరుడు అనిల్ వెంటనే కరీంనగర్‌లోని పలు దవాఖానల్లో చికిత్స కోసం ప్రయత్నించారు. కానీ అప్పటికే నాగరాజు కోమాలో ఉన్నట్లు గుర్తించిన వైద్యులు అతడికి చికిత్స అందించేందుకు ముందుకు రాలేదు. చివరి ప్రయత్నంగా ఓమెగా ప్రైవేట్ దవాఖానలో ప్రయత్నించగా గ్యారెంటీ ఇవ్వలేమని, చికిత్స అయితే అందిస్తామని చెప్పారు. అందుకు నాగరాజు కుటుంబ సభ్యులు కూడా అంగీకరించడంతో ఓమెగా దవాఖాన వైద్యులు గత నెల 26 నుంచి చికిత్స ప్రారంభించారు. తీవ్రమైన జ్వరం కారణంగా మెదడుపై ప్రభావం పడడంతో నాగరాజుకు మల్టీ ఆర్గాన్స్ డిస్ ఫంక్షన్ ఉన్నట్లు గుర్తించిన వైద్యులు దానికి తగినట్లుగా వైద్య సేవలు అందిస్తూ వచ్చారు. క్రమంగా అక్యూట్ ఎన్ సెఫలోపతి, రెస్పరేటర్ ఫెల్యూర్, విత్ ఆక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్ వంటి సమస్యలు కూడా ఏర్పడడంతో 15 రోజుల పాటు నాగరాజును వెంటిలెటర్‌పై ఉంచి ఆరుసార్లు డయాలసిస్ చేశారు. కోమాలో ఉన్న నాగరాజు క్రమంగా కోలుకున్న తర్వాత మరో వారం పాటు సాధారణ వైద్యాన్ని అందించిన తర్వాత డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు తల్లిదండ్రులు లక్ష్మి, యాదయ్య మాట్లాడుతూ, అతి తక్కువ ఖర్చుతో తన కొడుకుకు వైద్యులు పునర్జన్మను ఇచ్చారన్నారు. అదే కార్పొరేట్ దవాఖానలో అయితే సుమారు రూ. 30 లక్షల వరకు ఖర్చు య్యేదని, ఓమెగా హాస్పిటల్‌లో మాత్రం డబ్బులు అడగకుండా ముందు తమ కొడుకును బతికించే ప్రయత్నం చేశారని స్పష్టం చేశారు. వైద్యులకు రుణపడి ఉంటామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కాగా, నాగరాజుకు వైద్యం చేసిన బృందంలో నెఫ్రాలజిస్ట్ సందీప్, పల్మనాలజిస్ట్ వినిత, జనరల్ సర్జన్ మోహన్ కృష్ణ, జనరల్ ఫిజీషియన్ కిశోర్, మెడికల్ ఆఫీసర్ గణేశ్ ఉన్నారు. వీరికి ఎప్పటికీ రుణపడి ఉంటామని నాగరాజు తల్లి దండ్రులు, సోదరుడు అనిల్ తెలిపారు.

నగరంలో గ్రామాల విలీనం వద్దు

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు, పాల్గొన్న సభ్యులు

- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బల్దియా తీర్మానం
- ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ
- పెండింగ్ పనులను పూర్తి చేస్తాం: మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 21: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఆరు గ్రామాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ నగరపాలక సంస్థ పాలకవర్గం తీర్మానం చేసింది. అలాగే, నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు ఇతర ప్రజల సమస్యలపై సమావేశంలో వాడీవేడి చర్చ సాగింది. శనివారం ఉదయం 11 గంటలకు నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన పాలకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. దీనిలో ముఖ్యంగా నగరంలో సీఎం అస్యూరెన్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. అలాగే, నగరంలో కొత్తపల్లి మున్సిపాలిటీ, 5 గ్రామాలను విలీనాన్ని వ్యతిరేకిస్తూ సమావేశం తీర్మానం చేసింది. రానున్న అవసరాలను దృష్టిలో పెట్టుకొని నగరంలోని ఎఫ్‌ఎం రేడియో స్టేషన్ సమీపంలో మంచినీటి రిజర్వాయర్‌ను నిర్మించాలని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ కోరారు. మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నగరపాలక సంస్థలో గ్రామాల విలీనంపై పునరాలోచన చేసి దాన్ని విరమించుకోవాలన్నారు. ఇప్పుడు గ్రామాల విలీనంతో ప్రజలకు అన్యాయం జరుగడంతో పాటు నగరపాలక సంస్థపై భారం పెరుగుతుందని సభ్యులు పేర్కొన్నట్లు తెలిపారు. నగరంలో చేపట్టిన సీఎం అస్యూరెన్స్ అభివృద్ధి పనులను కూడా ఈ వారంలో ప్రారంభం చేసి పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో కమిషనర్, పాలకవర్గ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అక్రమ కేసులను వెంటనే తొలగించాలి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 21: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ వైర్మన్ బండ శ్రీనివాస్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై గొంతెత్తిన కేటీఆర్‌పై కక్షగట్టి కేసులు పెట్టడాన్ని ఖండించారు. ప్రజా సమస్యలపై కొట్లాడే వారిపై కుట్రపూరితంగా కేసులు పెట్టడం ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిపర్లు మారెపెల్లి సుశీల, కేసిరెడ్డి లావణ్య, ముక్క రమేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, నాయకులు చింత శ్రీనివాస్, తొగరు శివ పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ప్రశాంత జీవనం

ధ్యానం చేస్తున్న పోలీస్ అధికారులు

కొత్తపల్లి, డిసెంబర్ 21 : ప్రపంచ తొలి ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనీ ఐపీఎస్ వసుంధర, ఇతర ముఖ్య అధికారులు పాల్గొని వారి అనుభవాలను వివరించారు. యోగా, ధ్యానంతో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రతిరోజూ వీటిని సాధన చేయడం ద్వారా ప్రశాంత జీవనం గడుపవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వోవెల్స్‌లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

గణిత నమునాలను ప్రదర్శిస్తున్న వోవెల్స్ విద్యార్థులు

కొత్తపల్లి, డిసెంబర్ 21 : స్థానిక విద్యానగర్‌లోని వోవెల్స్ స్కూల్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో పాఠశాల చిన్నారులు గణిత సంబంధిత నమూనాలు, వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు. విద్యార్థులు తమ ప్రసంగాలు, ఆట పాటలతో శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్ర రంగంలో చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జె. తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ఫూర్తినింపిన అల్ఫోర్స్ గణితోత్సవ్

బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, నరేందర్‌రెడ్డి

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 21 కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో స్ఫూర్తిదాయకంగా అల్ఫోర్స్ గణితోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ హాజరయ్యారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, ఇతర అతిథులతో కలిసి శ్రీనివాస రామానుజన్ చిత్ర పటం వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అత్యుత్తమ గణిత బోధన అందించడం హర్షదాయకమన్నారు. విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రామానుజన్‌ను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని, కొత్త విషయాలను కనుక్కోవాలని సూచించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన అల్ఫోర్స్ మాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్ కరీంనగర్ జోన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దృమిన్ పాండ్య, ప్రముఖ విద్యావేత్త, వివిధ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో గణిత కాన్సెప్ట్ ఎక్స్‌పో

ఆద్వితస్కూల్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సాగని

కార్పొరేషన్, డిసెంబర్ 21: నగరంలోని ఆద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో గణిత దినోత్సవం సందర్భంగా శనివారం గణిత ప్రాముఖ్యతను తెలిపే కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. గణిత కాన్సెప్ట్ ఎక్స్‌పో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులో గణిత సిద్ధాంతాలు నిజ జీవితంలో ఎలా అన్వయ మవుతాయో సృజనాత్మకంగా ప్రదర్శించారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచడం ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సాగని, ప్రిన్సిపాల్ మధురి శ్వేత, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆకట్టుకున్న గణిత ప్రాజెక్టులు

కొత్తపల్లి, డిసెంబర్ 21 : జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని ప్యారడైజ్, సెయింట్ జార్జ్ సీబీఎస్ఈ పాఠశాల, మానేరు విద్యా సంస్థలు, మండలంలోని ఆసీఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గణితంపై పలు ప్రాజెక్టులను ప్రదర్శించి ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా రామానుజన్ గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమాల్లో సెయింట్ జార్జ్ విద్యా సంస్థల అధినేత డా.పి.ఫాతిమారెడ్డి, మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ఆసీఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఏంజెలిన్, గంగాచారి, నాగవేణి, హరికృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో..

ఏకశిల పాఠశాలలో గణిత నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 21: తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఏకశిల సీబీఎస్ఈ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఏకశిల విద్యాసంస్థల అధినేత గౌరు తిరుపతిరెడ్డి పూలమాల వేసి గణిత దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు గణిత నమూనాలను రూపొందించగా, ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చిదురాల దినేష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దూడల నరేశ్, స్టాఫ్ ఇన్‌చార్జి శరత్ బాబు, ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూమి స్వాధీనం

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 21: అన్నారం ఊర చెరువు శిఖం భూమి ఆక్రమణకు గురైనట్లు గతంలో కొందరు గ్రామస్తులు, రైతులు కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ క్రమంలో అధికారుల ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు మధ్య శనివారం ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేశ్వరి నేతృత్వంలో చెరువు శిఖం సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో దాదాపు 19 మంది రైతులు దాదాపు 21 ఎకరాల పైబడి భూమి కబ్జా చేసినట్లు గుర్తించారు. దానికి హద్దులు నిర్ణయించి కందకం తవ్వించారు. ఎవరైనా శిఖం భూములను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

రిపబ్లిక్ డే ఉత్సవాలకు ఎంపిక

కార్పొరేషన్, డిసెంబర్ 21: ఢిల్లీలో జరుగనున్న గణతంత్ర వేడుకలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని, ఎన్‌సీసీ కెడెట్ కె.శ్వేత ఎంపిక అయినట్లు అధికారి అయేషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థినికి కళాశాల ప్రిన్సిపాల్ వర లక్ష్మి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

విద్యానగర్, డిసెంబర్ 21: ప్రభుత్వ దవాఖానల్లో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్యాధికారులు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచి.. మాతా శిశు మరణాలను నివారించాలని ఆదేశించారు. నెలాఖరులోగా తమకు నిర్దేశించిన ప్రసవాల లక్ష్యం చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీ సమయంలో మెడికల్ ఆఫీసర్ ఉన్నది లేనిది రికార్డు నమోదు చేయాలన్నారు. జిల్లాలో సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు 29,712 మందికి ఆరోగ్య మహిళా కింద పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌వో వెంకటరమణ తెలిపారు. సమావేశంలో ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనా, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చందు, డీఐవో సాజిదా, పీవో డీటీ టీ ఉమశ్రీ, జిల్లాలోని మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఈ –కార్ రేస్‌పై రాద్ధాంతం సరికాదు

కలెక్టరేట్, డిసెంబర్ 21 : ఫార్ములా ఈ –కార్ రేస్‌తో రాష్ట్రానికి రూ.700కోట్ల ఆదాయం రాగా, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తూ, రాద్ధాంతం చేయడం సిగ్గుచేటని తెలంగాణ యువ జనుల ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మాగంటి బలరామ్ విమర్శించారు. శనివారం నగరంలోని కమాన్ సమీపంలో నిర్వహించిన ఆసంఘం ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న అనేక తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి, అణచివేయాలనుకుంటే ఆకాశంపై ఉమ్మేసినట్లేనన్నారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా డి.ఓంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.తిరుపతిరావు, కోశాధికారిగా మేచినేని కిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రతినిధులు వైద్యుల రమేశ్, మార్క మల్లికార్జున్, తైదల ప్రభుదాస్, వైద్య రవీందర్, చల్లగొండ విజయభాస్కర్‌రావు, వేముల మహేశ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

కొత్తపల్లి, డిసెంబర్ 21 : పంజాబ్ రాష్ట్రంలోని లూథియానాలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అల్ఫోర్స్ ఐఐటీ అకాడమీకి చెందిన విద్యార్థి పి. పార్థరెడ్డి ప్రతిభ చూపాడు. తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున పోటీపడ్డ అతడు అద్భుత ప్రతిభ చాటడంతో శనివారం కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

వాగేశ్వరిలో ధ్యాన దినోత్సవం

తిమ్మాపూర్, డిసెంబర్21: రామకృష్ణ కాలనీలో గల వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ధ్యానం చేయించారు. రోజూ ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత మానసిక ప్రశాంతత పెరుగుతుందని విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ గండ్ర శ్రీనివాస్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు అరుణ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేదికలపై రాణించాలి

కార్యక్రమాన్ని విక్షిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కార్పొరేషన్, డిసెంబర్ 21 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అంతర్జాతీయ వేదికలపై తమ ప్రతిభను చూపించి రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆకాంక్షించారు. పారమిత హెరిటేజ్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెడ్ ఎడ్ క్లబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం కళాభారతిలో సాగింది. దీనికి ఆమె హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రపంచ వేదికపై మాట్లాడేలా శిక్షణ అందిస్తున్న పారమిత విద్యాసంస్థలను అభినందించారు. టెడ్ ఎడ్ క్లబ్ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఇద్దరు, పారమిత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు తమ టెడ్ టాక్స్‌ని అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, ప్రభాకర్ రావు, మండల విద్యాధికారి గంగాధర్, పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ ప్రసాదరావు, టెడ్ క్యురేటర్ కే హన్మంతరావు, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వినోదరావు, రాకేశ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బిర్లాలో అట్టహాసంగా బహుళ సంస్కృతి సమ్మేళనం

విద్యార్థులతో బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 21: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బహుళ సంస్కృతి సమ్మేళనం పేరుతో నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ, హర్యానా రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణ, నృత్యాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన ఆర్టిటిగ్రేషన్, ప్రాజెక్టుర్, వీధి నాటకాలు, ర్యాంప్ వాక్, కార్ ర్యాలీ, జానపద గీతాలు మంత్ర ముగ్ధుల్ని చేశాయి. పాఠశాల చైర్మన్ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, నేటి తరం విద్యార్థులకు మన సంస్కృతిని పరిచయం చేస్తూ, అందులోని గొప్పతనాన్ని వివరించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వివిధ పోటీల్లో విజేతలైన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

శిశుగృహ సందర్శన

కలెక్టరేట్, డిసెంబర్ 21 : జాతీయ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ శనివారం నగరంలోని శిశుగృహ, బాలసదన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడుతూ, కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఉద్బోధించారు. అనంతరం బాలసదన్, శిశుగృహల్లోని వంటగదులు పరిశీలించారు. ఆహార పదార్థలు తనిఖీ చేసి, పరిశుభ్రమైన ఆహారం మాత్రమే అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, బాలసదన్, శిశుగృహ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి సెమినార్‌లో చింతకుంట ఉపాధ్యాయుడు

కొత్తపల్లి, డిసెంబర్ 21 : రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు కొత్తపల్లి మండలం చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అడిగొప్పుల సదయ్య ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి గణిత దినోత్సవాన్ని శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర విద్యా, పరిశోధన మండలి గోదావరి హాల్‌లో ఘనంగా నిర్వహించారు. వినూత్న బోధనా పద్ధతులు ఉపయోగించి విద్యార్థుల్లో గణిత సామర్థ్యాలు పెంపొందించే ఉపాధ్యాయుల పరిశోధన పత్రాలను ఎంపిక చేసి ప్రతి సంవత్సరం సన్మానిస్తుండగా, ఈ సంవత్సరం ఎంపికైన వారిలో అడిగొప్పుల సదయ్య ఉన్నారు. గణిత శాస్త్రంలోని అధ్యాయాలను ఆటల రూపంలో ఎలా బోధించవచ్చో సెమినార్‌లో ప్రదర్శించి ప్రశంసలు పొందారు. పాఠశాల విద్యా సంచాలకులు ఇ.వి. నర్సింహారెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వీణవంక, డిసెంబర్ 21: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన బండారి చేరాలు (55) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం జగ్గయ్యపల్లి నుంచి బేతిగల్‌కు అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్తున్న కారు బేతిగల్ శివారులో చేరాలు బైక్‌ను ఢీకొన్నది. అతడు బైక్‌పై నుంచి పడిపోగా, తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జమ్మికుంటకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి, చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. చేరాలు భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

ట్రాఫిక్ సమస్యపై కదిలిన అధికార యంత్రాంగం

గంగాధర, డిసెంబర్ 21: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కదలివచ్చారు. 'ట్రాఫిక్ చక్రవ్యూహంలో మధురానగర్ చౌరస్తా' శీర్షికన ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన అధికారులు ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీస్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా శనివారం రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు స్థానికులకు అవగాహన కల్పించారు.



హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు



వీణవంకలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి జన్మదిన కేక్‌కట్ చేస్తున్న నాయకులు

కేకులు కోసి.. స్వీట్లు పంచి

- నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి జన్మదిన వేడుకలు

హైదరాబాద్‌లోని నివాసంలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ టౌన్/రూరల్/జమ్మికుంట/వీణవంక/ఇల్లందకుంట, డిసెంబర్ 21: హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, సంబురాలు జరుపుకొన్నారు. అలాగే, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మలా శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. కార